క్లుప్తంగా

32 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

ఆదోని అర్బన్: శ్రీ పేట వీరభద్రస్వామి దేవాలయంలో వీరశైవ యువజన సంఘం ఆధ్వర్యంలో గోపీ చారిటబుల్ ట్రస్టు వారి సహకారంతో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 32 మంది వీరశైవ యువజన సంఘం సభ్యులు రక్తదానం చేశారు. శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని దేవస్థానంలో బ్లడ్ డొనేషన్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

గోనెగండ్ల : ట్రాక్టర్ యాజమానులు అధికారుల అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ గంగాధర్ హెచ్చరించారు. గోనెగండ్లకు చెందిన బోయ రంగస్వామి అనే వ్యక్తి ఆదివారం హెచ్. కైరవాడి గ్రామంలోని హంద్రీనదిలో నుంచి ఇసుకను ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తుండగా సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇసుక కావాల్సిన వారు చలనా కట్టి ఇసుక రిచ్‌ల నుంచి మాత్రమే తెచ్చుకోవాలన్నారు. అంతేగాని అక్రమంగా చెరువులు, వంకల నుంచి ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

గుంతల రోడ్డులో ఇక్కట్లు



బత్ర బొమ్మలపురం గ్రామ సమీపంలో గుంతలో ఇరుక్కుపోయిన బండల ట్రాక్టర్

కోసిగి: మండలంలోని అగసనూరు సమీపంలోని బత్రబొమ్మలపురం గ్రామం నుంచి సాతనూరు, తుంబిగనూరు గ్రామం వరకు రోడ్డు పూర్తి అధ్వానంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై పూర్తిగా గుంతలు పడ్డాయి. ఆదివారం గ్రామం మీదుగా బండల లోడ్‌తో వెళ్తున్న ఓ ట్రాక్టర్ రోడ్డు మధ్యలో ఉన్న గుంతలో ఇరుక్కుపోవడంతో దాదాపు రెండు గంటల పాటు వాహనాల రాకపోకలు ఎక్కడిక్కడే నిలిచి పోయాయి. కొన్ని వాహనాలు వెనక్కు తిప్పుకుని 20 కిలో మీటర్లు చుట్టూ వేసుకుని వెళ్లాల్సి వచ్చింది. ఎట్టకేల ఇరుక్కుపోయిన ట్రాక్టర్‌ను జేసీబీ సహాయంతో ముందుకు తోసి వేయడంతో వాహనాలు యాథావిధిగా కొనసాగాయి. సంబంధిత అధికారులు స్పందించి గుంతలుగా మారిన రోడ్డుకు మరమ్మతు చేయించాలని స్థానిక ప్రజలు కోరారు.

దోషులపై చర్యలు తీసుకోవాలి



వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ర్యాలీ

ఎమ్మిగనూరుటౌన్: తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూ కల్తీ విషయంలో దోషులను కఠినంగా శిక్షించాలని బీజేపీ తాలూకా కో కన్వీనర్ తొగట నరసింహులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని వెంకటసాయి ఆలయం నుంచి సోమప్ప సర్కిల్ వరకు విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతి స్వామి వారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగివుంటే దోషులెవరైనప్పటికీ శిక్షించాల్సిందేనన్నారు. కార్యక్రమంలో వెంకటసాయి ఆలయ సభ్యులు శ్రీనివాసులు, తిమ్మప్ప, రాముడు, గీతామందిర్ సభ్యులు ధనలక్ష్మి నాగరాజు, శివదాసు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలు ఆర్థికంగా బలోపేతం కావాలి

కోసిగి: పద్మశాలి కులబాంధవులు అన్ని రంగాల్లో రాణించి ఆర్థికంగా బలోపేతం కావాలని పద్మశాలి సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. ఆదివారం కోసిగి శ్రీ మార్కండేయ స్వామి ఆలయ కల్యాణ మండపంలో మండల స్థాయి సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కులబాంధవుల ఆరాధ్య దైవం శ్రీ భక్త మార్కండేయ స్వామి ఆలయం అభివృద్ధికి అందరూ కలిసి కట్టుగా సహకరించాలన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి జేరుబండి నరసింహులు, కేతారి వెంకటేష్ పాల్గొన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: మండలంలోని దేవరగట్టులో వెలిసిన మాళ మల్లేశ్వర స్వామికి ఆదివారం సందర్భంగా ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. మూల విరాట్‌లకు తెల్లవారుజామున సుప్రభాత సేవా, అభిషేకాలు, బండారార్చన, కుంకుమార్చన, మహామంగళ హారతి, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర పూజలను శాస్త్రోక్తంగా జరిపించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామి వారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు.భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేపట్టారు.

మండితున్న ధరలు.. మాడుతున్న కడుపులు

- ఆకాశనంటుతున్న ధరలు
- కూరగాయలే
- నగటుజీవికి సాపాటు కష్టాలు

'సారూ.. వచ్చే ఆదాయం సరుకులకు సరిపడక పప్పు చేయడం మానుకున్నాం.. చర్మకారుడు మూకయ్య ఆవేదన.. 'కూరగాయలతో సరిపుచ్చుకుందామంటే నూనె ధరలు, కూరగాయలరేట్లు మండిపోతున్నాయి' చేనేత కార్మికురాలు పద్మావతి వేదన ఇది.. వీరే కాదు పెరిగిన నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలపై ఎవరినీ కదిపినా ఇలాంటి కష్టాలే.. మండిపోతున్న ధరలతో కడుపుమాడ్చుకుంటున్న సగటుజీవి వేదన. సంపద సృష్టించి సామాన్యుల కష్టాలు తీర్చుతానన్న చంద్రబాబు అమరాతి ఊహామేడల్లో, తిరుమల లడ్డూ కల్తీ పేరుతో ఆలయాన్ని అప్రతిష్టపాలు చేయడంలో తలమునకలై సగటుజీవిని కష్టాల కడలిలో తోసేశాడంటూ నిట్టూర్పులే..

ఎమ్మిగనూరు: ముఖ్యమంత్రి చంద్రబాబు కాలిమహిమో.. పండుగ పబ్బం గడుపుకోవాలనే వ్యాపారుల కాసుల మైకమోగానీ నిత్యావర ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఏడాది క్రితం ఉన్న ధరలు ఈఏడు దాదాపు రెట్టింపయ్యాయి. రోజు రోజుకీ పెరుగుతూ పోతున్న నిత్యావసర ధరలు సామాన్యులను కలవర పెడుతున్నాయి.

రికార్డు స్థాయిలో పెరిగిన ధరలు

గతేడాది ఇదే సమయానికి ఎమ్మిగనూరులో కిలో రూ.55లు ఉండే సోనా బియ్యం ఇప్పుడు రూ.70లుకు చేరింది. గతేడాది కిలో రూ.140లు ఉండే కందిబేడలు ఈ ఏడాది రికార్డు స్థాయిలో రూ.200ల మార్కును దాటేశాయి. ఇక మిన పప్పు, నూనె, చింతపండు, ఎండు మిర్చి ధరలతోపాటు కూరగాయల ధర అడిగితే దడ మొదలవుతోంది. కూరగాయలు ఏదీ కొందామన్నా కిలో రూ.60కుపైమాటే. ధరలను నియంత్రించటంలో.. కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారుల పనిపట్టడంలో పాలకులు, అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

25 శాతం పెరిగిన వంటనూనె ధరలు

కేంద్రప్రభుత్వం ఇటీవల పెంచిన సుంకాల ప్రభావంతో ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకొనే పామాయిల్, సోయాబీన్, సన్‌ఫ్లవర్ వంట నూనేలు 25శాతం పెరిగిపోయాయి. రైసు మిల్లర్లపై నియంత్రణ లేకపోవటంతో సన్నబియ్యం ధరలు పెరిగాయి. కర్నూలు సోనా క్వింటాల్ రూ.6,400, నంద్యాల సోనా బియ్యం క్వింటాల్ రూ.7,000ల మార్కును దాటేశాయి.



కూరగాయల మార్కెట్‌లో జనం పలుచగా ఉన్న దృశ్యం

తగ్గిన దిగుమతులు

ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలు వరదలకు అపార పంట నష్టం కలిగింది. రైతులు సాగు చేసిన కూరగాయలు దెబ్బతిన్నాయి. అదేవిధంగా మహారాష్ట నుంచి ఉల్లి దిగుమతులు తగ్గిపోయాయి. కిలో ఉల్లి రూ.70 పలుకుతోంది. మధ్యప్రదేశ్ నుంచి దిగుమతి చేసుకొనే వెల్లుల్లి కొరత ఏర్పడి ధరలు విపరీతంగా పెరిగాయి. కిలో రూ.400 పైనే ఉంది. ఉప్పు నుంచి పప్పుల వరకూ ధరలు రోజు రోజుకూ పెరుగుతుండటంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు అల్లాడిపోతున్నా యి.

ముఖ్యమైన ఆహార సరుకుల ధరలు

రకం	గతేడాది ధర(కిలో)	ప్రస్తుత ధర
సన్నబియ్యం	రూ.55	రూ.70
కందిబేడలు	రూ.120	రూ.145
మినపప్పు	రూ.120	రూ.150
సన్‌ఫ్లవర్ ఆయిల్	రూ.90	రూ. 135
వేరుశనగ నూనె	రూ.120	రూ.150
టమాట	రూ.30	రూ.60
వంకాయ	రూ.25	రూ.50
ఆలుగడ్డలు	రూ.30	రూ.70
చిక్కుడు	రూ.70	రూ.120
ఉల్లి	రూ.40	రూ.70

ధరలు పెరిగిపోయాయి..



నిత్యావసర ధరలు ఆకాశాన్నంటాయి. కూరగాయల ధరలు పెరిగిపోయాయి. దసరా, దీపావళి పండుగల సంబరాలు చేసుకోవాలంటేనే భయమేస్తోంది. గత ప్రభుత్వం ఇచ్చే నేతన్న నేస్తం కూడా ఈ ప్రభుత్వం ఇవ్వలేక పోయింది. మగ్గం ఆడితేనే మా కడుపులు నిండే పరిస్థితులొచ్చాయి. లేకపోతే పస్తులే.

– లక్ష్మి, చేనేత కార్మికురాలు

ప్రభుత్వానికి పట్టడంలేదు



ఈ ప్రభుత్వం పేద, మధ్య తరగతి కుటుంబాలను పట్టించుకోవడం లేదు. అమరావతి భ్రమల్లో, తిరుపతి స్వామిని లడ్డూ పేరుతో అప్రతిష్టపాలు చేసే పనుల్లో పడింది. సూపర్ సిక్స్ అంటూ మోసగించింది. సంపద సృష్టిస్తామంటూ సామాన్యులను సమస్యల్లో నెట్టింది.

– జయన్న, రైతు

ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలి

నందవరం : మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలోని తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మాఫియాపై చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ కోనేరు నాగేంద్ర ప్రసాద్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నది నుంచి జోరుగా ఇసుకను తరలిస్తున్నారన్నారు. విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు రోజులుగా ఇసుక తరలిస్తున్నారని రెవెన్యూ, పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందని చెప్పారు. నాగలదిన్నె నది ఒడ్డు నుంచి ఇసుక ట్రాక్టర్లు మిట్టసోమపురం, తిమ్మాపురం, కలగట్ల గ్రామాల మీదుగా అక్రమ రావాణ సాగుతోందని వివరించారు. శనివారం కర్నూలు నుంచి మైన్స్, విజిలెన్స్ అధికారులు వచ్చినా ఎలాంటి చర్యలు లేవన్నారు. అధికార పార్టీ నాయకుల అండ దండలతోనే ఇసుక రవాణా సాగుతోందని, అందుకే అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఎస్పీ ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

రేపు బనవాసిలో రైతులకు శిక్షణ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం రబీ పంటల సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డా. కె.రాఘవేంద్రచౌదరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రబీ సీజన్‌లో శనగ, కుసుమ, జొన్న తదితర పంటలపై జిల్లా వనరుల కేంద్రం సహకారంతో రైతులకు ఒక్క రోజు శిక్షణ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

ఆదోని అభివృద్ధికి ఐక్యంగా పోరాడుదాం



మాట్లాడుతున్న ఆదోని జిల్లా సాధన కమిటీ కన్వీనర్ పగడాల కోదండ

ఆదోని టౌన్: ఆదోని రెవెన్యూ డివిజన్‌ను జిల్లాగా ప్రకటించాలని, ఆదోని ప్రాంత అభివృద్ధికై ఐక్యంగా ఉద్యమించాలని ఆదోని జిల్లా సాధన కమిటీ కన్వీనర్ పగడాల కోదండ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని బీసీ ఫెడరేషన్ కార్యాలయంలో ఆదోని జిల్లా సాధన కమిటీ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆదోని జిల్లా సాధన కమిటీ కన్వీనర్ పగడాల కోదండ, గౌరవ అధ్యక్షుడు దస్తగిరి నాయుడు మాట్లాడుతూ.. అత్యంత వెనుకబడిన ప్రాంతమైన ఆదోని రెవెన్యూ డివిజన్‌ను జిల్లాగా ప్రకటించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని రాష్ట ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదోనిలో ప్రత్యేక యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, వేదావతి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలన్నారు.

మెడికల్ కాలేజీ నిర్మాణం ఆపేయడం దారుణం

ఈ ప్రాంతంలో వలస నివారణ ఉపాధి కల్పన కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని కోదండ, దస్తగిరి నాయుడు అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన ఆదోని మెడికల్ కళాశాల పనులను కూడా ప్రభుత్వం నిలిపి వేయడం దారుణమన్నారు. తక్షణమే ఆదోని మెడికల్ కళాశాల పనులను ప్రారంభించి అతి త్వరలో ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని కోరారు. ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం ప్రాంతాల్లో ప్రధానమైన నీటి సమస్యలు, నూతన ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు రానున్న రోజుల్లో అన్ని ప్రాంతాల్లో అన్ని రాజకీయ పార్టీలకు, ప్రజా సంఘాలను కలుపుకుని రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి ఉద్యమాలకు కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట నాయకులు కె.నాగరాజు, బీఎస్పీ నాయకులు రామలింగ, బంగారప్ప, డీఎస్ఎఫ్ నాయకులు ఉదయ్, బీసీ ఫెడరేషన్ నాయకులు షేక్షావలి, బీసీ ప్రజావేదిక నాయకులు రామచంద్ర, ఆదోని జిల్లా సాధన కమిటీ నాయకులు అష్రాఫ్, పాండురంగ, కత్తి రవి, బొజ్జన్న పాల్గొన్నారు.



కేసరి బేడలు, కొబ్బరి తురుముతో శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వకు అలంకరణ



వనదుర్గ అలంకారంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు



ముత్యాల అలంకారంలో శ్రీ పేట వీరభద్రేశ్వరస్వామి



లలితాత్రిపుర సుందరీదేవి అలంకరణలో దొండు మారెమ్మవ్వ

మాతా పాహిమాం.. రక్షమాం

ఆదోని అర్బన్: శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు అమ్మవారు ఆయా అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదోని ఇలవేల్పు శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ కేసరి బేడలు, కొబ్బరి తురుము అలంకారంలో, వనదుర్గా అలంకారంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు, ముత్యాల అలంకారంలో శ్రీ పేట వీరభద్రేశ్వరస్వామి వారు, గజలక్ష్మి అవతారంలో ఎమ్మిగనూరు రోడ్డులోని గంగా భవానీదేవి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూల అలంకరణ, విద్యుత్ దీపాలంకరణ, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. శ్రీ పేట వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

ఆదోని రూరల్: మండలంలోని జాలిమంచి గ్రామంలో వెలసిన అంబాభవాని ఆలయంలో అమ్మవారు, నెట్టేకల్ గ్రామానికి వెళ్లే రహదారిలో వెలిసిన దొండు మారెమ్మవ్వ వారు లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

బాలాత్రిపురసుందరిగా కాళీమాత

పెద్దకడబూరు : మండల కేంద్రంలోని కాళీమాత ఆలయంలో వెలసిన కాళీమాత బాలత్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. మండల పరిధిలోని దొడ్డిమేకల శివాలయంలో వెలసిన పార్వతిదేవి, మండల కేంద్రంలోని చౌడేశ్వరిదేవి, పెద్ద లక్ష్మమ్మవ్వ వివిధ రూపాలలో భక్తులను కనువిందు చేశారు. ఆలయ పూజార్లు వీరభద్రయ్య, నరసింహాచారి, హరికృష్ణ ఆచారి, వినోద్ ఆచారి ఉదయం అమ్మవార్లకు కుంకుమార్చన, బిల్వార్చన తదితర పూజలు నిర్వహించారు.



పేట వీరభద్రస్వామి ఆలయంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

కూష్మాండదుర్గగా శాంభవి దేవి

కోసిగి: కందుకూరు గ్రామంలో వెలసిన శాంభవి దేవి ఆలయంలో అమ్మవారు కూష్మాండదుర్గ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయంలో ఆలయ అర్చకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, నూతన వస్త్రాలంకరణ గావించారు. అమ్మవారికి వెండికవచ అలంకరణలు, ఫల, పుష్పాలంకరణలు గావించి మహా మంగళ హారతులు, ప్రత్యేక పూజలు చేశారు.

మధుర మీనాక్షి దేవిగా..

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మధుర మీనాక్షి అలంకారంతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా వేదగాయిత్రీ దేవి, తేరు బజారులో ఏర్పాటు చేసిన అమ్మవారు గోనెగండ్ల రోడ్డులోని అంబాభవాని ఆలయంతో పాటు పలు ఆలయాల్లో వివిధ అలంకారాల్లో అమ్మవారు పూజలందుకున్నారు.

అన్నపూర్ణదేవి అలంకరణలో అమ్మవారు

నందవరం : శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా ఆదివారం అమ్మవారు అన్నపూర్ణ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మండల పరిధిలోని సోమలగూడూరులో గ్రామంలో పెద్దమ్మ తల్లికి శ్రీధర్ స్వామి ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేకాలంకరణ గావించారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారికి జలాభిషేకాలు, కుంకుమార్చన, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని అన్నపూర్ణ దేవిగా అలంకరించారు.



బాలాత్రిపురసుందరి దేవి అలంకారంలో పెద్దకడబూరు కాళీమాత



కోసిగిలో కూష్మాండదుర్గ అలంకరణలో అమ్మవారు



ఎమ్మిగనూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో మధుర మీనాక్షి అలంకారం



సోమలగూడూరులో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న పురోహితులు

న్యాయం జరిగేవరకు దీక్ష విరమించేది లేదు

ఎమ్మిగనూరుటౌన్: బీసీల దాడిలో గాయపడిన పెద్దకడుబూరు మండలం కల్లుకుంట్ల గ్రామానికి చెందిన దళిత మహిళ గోవిందమ్మకు న్యాయం జరిగేవరకూ దీక్ష విరమించేదిలేదని దళిత, ప్రజా సంఘాల నాయకులు స్పష్టం చేశారు. గోవిందమ్మ పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో చేపట్టిన దీక్ష ఆదివారం ఐదోరోజుకు చేరుకుంది. అయితే ఆమెతో దీక్ష విరమించాలని పట్టణ సీఐ సుదర్శన్‌రెడ్డితో పాటు కోసిగి, మంత్రాలయం సీఐలు మంజునాథ్, రామాంజులు, ఎస్ఐ నిరంజన్‌రెడ్డి కోరగా అందుకు దళిత, ప్రజా సంఘాలు ఒప్పుకోలేదు. జిల్లా కలెక్టర్, ఎస్పీ వచ్చి న్యాయం చేసేంతవరకూ బాధితురాలు దీక్ష విరమించదని.. ఆమెకు సంఘీభావం ప్రకటించిన ఆయా సంఘాల నాయకులు లక్ష్మీనారాయణ, రామతీర్థం అమరేష్, ప్రసన్న, రంగయ్య, నరసన్న, నరసప్ప, బతుకమ్మ, ఈరన్న తదితరులు తేల్చిచెప్పారు. కాగా ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని న్యాయం జరుగుతుందని సీఐలు వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా వినకపోవడంతో మిన్నకుండిపోయారు.



గోవిందమ్మతో దీక్ష విరమింపజేయాలని కోరుతున్న సీఐలతో వాదిస్తున్న దళిత సంఘాల నాయకులు

కార్యకర్తలకు అండగా ఉంటాం



కల్లుకుంటలో మహమ్మద్ బాషా మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

పెద్దకడబూరు: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎటువంటి సమస్య వచ్చినా తమ కుటుంబం అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ రాష్ట యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి భరోసా కల్పించారు. మండల పరిధిలోని కల్లుకుంటలో వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్ మహమ్మద్ బాషా(38), నౌలేకల్లు గ్రామానికి చెందిన కార్యకర్త కుమ్మరి గోవిందమ్మ (55) అనారోగ్యంతో శనివారం రాత్రి చనిపోయారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వై.ప్రదీప్‌రెడ్డి ఆదివారం వారి మృతదేహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలుపుతూ అండగా ఉంటామని భరోసానిచ్చారు.

'ప్రాణభయం ఉంటే పోలీసులను కలవాలి'

ఆదోని టౌన్: ఆదోని ఎమ్మెల్యే పార్థసారథికి ప్రాణభయం ఉంటే పోలీసుశాఖ ఉన్నతాధికారులను కలిసి రక్షణ పొందాలని, ప్రాణహాని ఉందని మీడియాలో వాయిస్ ఇవ్వడం వల్ల లాభం ఉండదని ఎంహెచ్‌పీఎస్ రాష్ట కార్యదర్శి నూర్ అహ్మద్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే గారు.. మీకు ఎవరితోనైనా ప్రాణాపాయం ఉంటే వారి పేర్లు, వివరాలు ప్రభుత్వానికి తెలియజేసి వారిపై చర్యలు తీసుకునే విధంగా, మీరు రక్షణ పొందే విధంగా ముందుకు వెళ్లాలన్నాని సూచించారు. ఎమ్మెల్యేగా ఉండి మీడియాలో ప్రెస్ మీట్ ఇవ్వడం వల్ల ప్రజలకు తప్పుడు సంకేతాలు ఇచ్చిన వారవుతారన్నారు. మాటిమాటికి తనకు ప్రాణహాని ఉందని చెప్పి ఆదోని పేరును బదనాం చేయవద్దని కోరారు. మీరు ఇలాంటి వాయిస్ ఇవ్వడం వల్ల రాష్ట వ్యాప్తంగా, దేశవ్యాప్తంగా ఆదోనికి చెడ్డపేరు వస్తుందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. సమావేశంలో ఎంహెచ్‌పీఎస్ నాయకులు వసీంసాహెబ్, రామలింగ, నరేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంహెచ్‌పీఎస్ రాష్ట కార్యదర్శి నూర్ అహ్మద్

శిథిలావస్థలో భవనం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వీవర్స్ కాలనీలో ఉన్న మండల విద్యాశాఖ అధికారి కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు పూర్తిగా శిథిలం కావడంతో ఎంఈఓతో పాటు సిబ్బంది బిక్కుబిక్కు మంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. పైకప్పు పెచ్చులూడిపోవడంతో ఎప్పుడు ఎవరిపై పడుతుందోనని భయాందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి పైకప్పు నుంచి వర్షపు నీరు కారి కార్యాలయంలో వున్న కంప్యూటర్ సైతం చెడిపోయిందని సిబ్బంది వాపోయారు. ప్రస్తుతం ఉన్న భవనాన్ని పూర్తిగా కూల్చివేసి పునర్నిర్మాణం చేపట్టాలని, కేవలం మరమ్మతులు చేస్తే ముమ్ముందు కార్యాలయ భవనంతో ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొంటున్నారు. కార్యాలయం పూర్తిగా శిథిలం కావడంతో పాఠ్యపుస్తకాలు వేరే పాఠశాలల్లో నిల్వ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. భవనం శిథిలం కావడంతో ఇబ్బంది పడుతున్నామని భవన నిర్మాణం, మరమ్మతుల విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి.. తగిన చర్యలు తీసుకుంటామని ఎంఈఓ ఆంజనేయులు వివరించారు.



పెచ్చులూడిన పైకప్పు



అస్తవ్యస్తంగా మారిన రహదారి

రహదారి అస్తవ్యస్తం.. ప్రయాణం కష్టం

ఆదోని సెంట్రల్: ఆదోని నుంచి ఆస్పరి వెళ్లే రహదారి అస్తవ్యస్తంగా మారింది. బిణిగేరి గ్రామం వద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రహదారి గుంతలయంగా మారి, వర్షం కురిస్తే నీరు నిల్వ ఉంటున్నాయి. ట్రాన్స్‌పోర్టు వాహనాలు అనంతపురం, గుత్తి, పత్తికొండ వంటి ప్రాంతాల నుంచి ఆస్పరి, ఆదోని మీదుగా శిరుగుప్ప, రాయచూర్ వంటి ప్రాంతాలకు నిత్యం తిరుగుతుంటాయి. పత్తి, టమాట, వేరుశనగ వంటి పంట దిగుబడులను మార్కెట్‌కు తరలించేందుకు వ్యాపారులు, రైతులు ఈ రోడ్డుపైనే రాక పోకలు కొనసాగిస్తూ ఉంటారు. బిణిగేరి వద్ద ఏర్పడిన గుంతలను చూసి వాహనదారులు ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతల మయమైన రహదారికి మరమ్మతులను చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



బిణిగేరి వద్ద గుంతలు ఎర్పడిన రహదారి